

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 157 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 08, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# ఏంది రా.. లొల్లి!





## తెలంగాణ రాజకీయాల్లో "స్టార్" వార్..

## బీజేపీ-బీఆర్ఎస్ మాటల తూటాలు..

## మధ్యలో ట్విట్టర్ ట్రోల్స్ హల్‌చల్

హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధం ముదిరింది. ఒకవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ తీవ్ర విమర్శలు గుప్పించగా.. మరోవైపు మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. ఇదే సమయంలో కరీంనగర్‌లో బీజేపీ-బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం రాజకీయ వేడిని మరింత పెంచింది. సోషల్ మీడియాలో అయితే "సూసైడ్ స్టార్", "తంబాకు స్టార్", "ట్విట్టర్ ట్రోల్స్" అంటూ సెటైర్లు, మీమ్స్ వైరల్ అవుతున్నాయి.

**"జై శ్రీరాం అంటేనే ఢిల్లీ నుంచి నిధులు" : బండి సంజయ్ ఫైర్**

సికింద్రాబాద్ మహంకాళి జిల్లా బీజేపీ నాయకుల సమావేశంలో పాల్గొన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "జై శ్రీరాం, జై తెలంగాణ నినాదాలతోనే ఢిల్లీ నుంచి తెలంగాణకు నిధులు వస్తున్నాయి" అంటూ వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ తెలంగాణ అభివృద్ధికి రూ. 8,500 కోట్ల పనులు ప్రారంభించబోతున్నారని.. గత 12 ఏళ్లలో తెలంగాణకు రూ. 12 లక్షల కోట్లకు పైగా కేంద్ర నిధులు వచ్చాయని చెప్పారు. "హిందీ మాట్లాడే మోదీ తెలంగాణకు నిధులు తెస్తుంటే.. తెలుగు మాట్లాడే రేవంత్ రెడ్డి మాత్రం హామీలు అమలు

- మిగతా 2లో..



**డాక్టర్ బరిగెల శివ**

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## హైదరాబాద్‌లో మరో మెట్రో అద్భుతం..

భూమి లోపల, పైన, ఆకాశంలో ప్రయాణం!

హైదరాబాద్‌లో 40 కి.మీ పొడవైన కొత్త మెట్రో కారిడార్‌కు ప్రణాళిక

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు నిర్మాణం

అండర్‌గ్రౌండ్, ఎలివేటెడ్, భూమిపై వెళ్లేలా వినూత్న డిజైన్

ఈ మార్గాన్ని ఫేజ్-3లో చేపట్టాలని కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి



2

## కేటీఆర్‌పై క్రిమినల్ కేసు నమోదు

రైతు సంగ్రామ సదస్సు వేదికగా రాహుల్, రేవంత్ లపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు

కేటీఆర్ వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

బీఎన్ఎస్ సెక్షన్లు 504, 505 కింద కేసు నమోదు చేసిన పోలీసులు



3

## గంగుల కమలాకర్ కార్యాలయం వద్ద దాడి కౌశిక్ రెడ్డి కారు ధ్వంసం !

6

### విజయ్ గెలుపు రహస్యం చెప్పిన తెలంగాణ మంత్రి వివేక్

తమిళనాడులో విజయ్ గెలుపుపై మంత్రి వివేక్ వ్యాఖ్యలు

సోషల్ మీడియా రీల్స్ కూడా విజయ్ గెలుపునకు కారణమన్న వివేక్

యువ నాటకోత్సవాల వేదికగా ఆసక్తికర విశ్లేషణ

కళలకున్న శక్తికి విజయ్ గెలుపే నిదర్శనమని వెల్లడి

పాఠశాలల్లో సంగీతం, నాట్యం కోర్సులుండాలని సూచన



5



## ఉపరితల ద్రోణి..

### రెండు తెలుగు రాష్ట్రాలకు 3 రోజుల పాటు వర్ష సూచన

కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

ద్రోణి ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని వెల్లడించిన వాతావరణ శాఖ

ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం

5

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# గురుకులాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు




**హన్మకొండ, 7 మే 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల వరంగల్--కరీంనగర్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో 2026--27 విద్యాసంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న జూనియర్ కళాశాల అధ్యాపక పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి వెల్లడించారు. గురుకుల విద్యాసంస్థల్లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించిన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఇందులో గణిత శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం మరియు గణిత డిగ్రీ విభాగాల్లో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులు, బయోడేటా, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు హనుమకొండలోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులను అవసరాన్ని బట్టి వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలోని గురుకుల విద్యాసంస్థల్లో నియమించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో మరో మెట్రో అద్భుతం..

**భూమి లోపల, పైన, ఆకాశంలో ప్రయాణం!**
**హైదరాబాద్‌లో 40 కి.మీ పొడవైన కొత్త మెట్రో కారిడార్‌కు ప్రణాళిక**
**శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు నిర్మాణం**
**అండర్‌గ్రౌండ్, ఎలివేటెడ్, భూమిపై వెళ్లేలా వినూత్న డిజైన్**
**ఈ మార్గాన్ని ఫేజ్-3లో చేపట్టాలని కేంద్రానికి సీఎం రేవంత్ విజ్ఞప్తి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్‌సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు 40 కిలోమీటర్ల పొడవైన కొత్త కారిడార్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించాలని నిర్ణయించింది. ఈ మార్గాన్ని మూడో దశ కింద చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేంద్రానికి విజ్ఞప్తి చేయడంతో ఈ ప్రాజెక్టుపై ఆసక్తి పెరిగింది. ఈ కారిడార్ నిర్మాణం ప్రత్యేకంగా ఉండనుంది. ప్రయాణ సమయాన్ని 40 నిమిషాలకు పరిమితం చేసేలా భూమి లోపల (అండర్‌గ్రౌండ్), పిల్లర్లపై (ఎలివేటెడ్), నేలపై (ఎట్-గ్రేడ్) వెళ్లేలా మిశ్రమ పద్ధతిలో డిజైన్ చేశారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ నుంచి కార్గో వరకు 2 కిలోమీటర్లు అండర్‌గ్రౌండ్‌లో, ఆ తర్వాత మన్సాన్‌పల్లి, పెద్ద గోల్కొండ, రావిర్యాల ఎగ్జిట్‌ల మీదుగా 20 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ మార్గంలో మెట్రో ప్రయాణిస్తుంది. ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన అంశం, రావిర్యాల ఎగ్జిట్ నుంచి స్కిల్ యూనివర్సిటీ వరకు 18 కిలోమీటర్ల దూరం భూమిపైనే రైలు పరుగులు పెట్టనుంది. ఇందుకోసం హెచ్‌ఎండీఏ నిర్మించనున్న 100 మీటర్ల వెడల్పు గల గ్రీన్‌ఫీల్డ్ రహదారి మధ్యలో 22 మీటర్ల స్థలాన్ని మెట్రోకు కేటాయించారు. ఈ మార్గంలో మొత్తం 16 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి, మెట్రో రెండో దశలోని ఐదు కారిడార్ల డీపీఆర్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (నామీమా) నాలుగు నెలల క్రితమే కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజాగా ఈ ఎయిర్‌పోర్ట్-స్కిల్ వర్సిటీ మార్గాన్ని ఫేజ్-3లో చేపట్టాలని కేంద్రమంత్రి ఖట్టర్‌ను కోరడం ప్రభుత్వ ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది.

# 30 ఏళ్లు ఢిల్లీలో ఉన్నా.. హైదరాబాద్‌లోనే అసలైన జీవితం దొరికింది..

**నగరంలో భద్రత, మానసిక ప్రశాంతత మెరుగ్గా ఉందన్న పర్వ్ శర్మ**
**ఢిల్లీలో నిరంతరం భయంతో బతకాల్సి వచ్చేదని వెల్లడి**
**తెలంగాణ పోలీసుల పనితీరును ప్రశంసించిన యువకుడు**
**హైదరాబాద్ మిమ్మల్ని దత్తత తీసుకుంటుందంటూ నెటిజన్ల కామెంట్లు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

"గత 30 ఏళ్లుగా ఢిల్లీలో పుట్టి పెరిగాను. కానీ, హైదరాబాద్ నగరానికి వచ్చిన తర్వాతే అసలైన భద్రత, మానసిక ప్రశాంతత అంటే ఏంటో తెలిసింది" అంటూ పర్వ్ శర్మ యోధ అనే యువకుడు పంచుకున్న ఓ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఢిల్లీలోని జీవనశైలితో పోలిస్తే హైదరాబాద్‌లో తనకు లభించిన భద్రతా భావం, స్వేచ్ఛాయుత వాతావరణం గురించి ఆయన ఎంతో భావోద్వేగంతో వివరించారు. ఉద్యోగ రీత్యా తన భార్యతో కలిసి హైదరాబాద్‌కు మకాం మార్చిన పర్వ్, తన అనుభవాలను పంచుకున్నారు. "ఢిల్లీలో రోడ్డు మీద నడుస్తున్నప్పుడు ఫోన్ పట్టుకోవాలన్నా, ఒంటి మీద బంగారం వేసుకోవాలన్నా నిరంతరం ఓ కన్నేసి ఉంచాలి. దొంగతనాలు, వేధింపుల భయంతో ఎప్పుడూ వెనక్కి తిరిగి చూసుకుంటూ అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా మహిళలు రాత్రిపూట ఒంటరిగా ప్రయాణిస్తే, వారు ఇంటికి చేరేవరకు కుటుంబమంతా ఫోన్ కాల్స్, లొకేషన్ ట్రాకింగ్‌తో కంగారు పడటం అక్కడ సర్వసాధారణం" అని ఆయన పేర్కొన్నారు. అయితే, హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత తన ఆలోచనా విధానంలో పూర్తి మార్పు వచ్చిందని పర్వ్ తెలిపారు. "ఇక్కడ నేను, నా భార్య రాత్రిపూట కూడా ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా బయట నడవగలుగుతున్నాం. తను పని మీద ఒంటరిగా బయటకు వెళ్లినా నాకు ఢిల్లీలో ఉన్నప్పటి ఆందోళన ఇప్పుడు లేదు. ఈ నగరం ఎంతో సురక్షితమైనది" అని ఆయన అన్నారు. గత రెండేళ్లలో ఒక్కసారి మాత్రమే పోలీసులు సాధారణ తనిఖీ కోసం ఆపారని, వారు కూడా ఎంతో గౌరవంగా, సహాయకరంగా ప్రవర్తించారని తెలంగాణ పోలీసుల పనితీరును ప్రశంసించారు. కేవలం భద్రతే కాకుండా ఈ నగరం తనకు ఆధ్యాత్మిక చింతన, మంచి స్నేహితులు, కెరీర్ ఎదుగుదలను కూడా అందించిందని సంతోషం వ్యక్తం చేశారు. పర్వ్ వీడియోపై స్పందించిన నెటిజన్లు ఆయన అభిప్రాయాలతో ఏకీభవించారు. ఇక్కడికి వచ్చాక మరో చోట ఉండలేరు" అని ఒకరు కామెంట్ చేయగా, "నేను ఉత్తరాదికి చెందిన అమ్మాయిని, హైదరాబాద్‌లో వివాహం చేసుకున్నాను. ఇక్కడి ప్రజలు నిరాడంబరంగా, ఎలాంటి ఆడంబరాలు లేకుండా ఉంటారు. ఢిల్లీలోని గందరగోళ జీవితంతో పోలిస్తే ఇక్కడ ప్రశాంతమైన జీవితం దొరికింది" అని మరో మహిళ పేర్కొన్నారు. అయితే, నగరం చాలా సురక్షితమైనప్పటికీ, రెండుసార్లు తన ఫోన్ పోయిందని, ఇలాంటి చిన్న చిన్న ఘటనలు మినహా హైదరాబాద్‌లో జీవించడం గొప్ప అనుభూతి అని మరో నెటిజన్ వ్యాఖ్యానించారు.

# ఏంది రా ఈ లొల్లి..!

మొదటి పేజీ తరువాయి

చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారు" అంటూ విమర్శించారు. రేవంత్ రెడ్డిని "గేమ్ ఛేంజర్ కాదు.. తెలంగాణ లూటర్"గా అభివర్ణించిన బండి సంజయ్.. కేరళ ఎన్నికల ప్రచారంపై కూడా సెటైర్లు వేశారు. "రాహుల్ గాంధీ కుర్చీలో ఎప్పుడెప్పుడు కూర్చోవాలా అని రేవంత్ రెడ్డి ఎదురుచూస్తున్నారు" అంటూ ఎద్దేవా చేశారు.

**"కాంగ్రెస్ రైతుల ఉసురు తీస్తోంది" : హరీశ్ రావు ధ్వజం**

సూర్యాపేట జిల్లా కోదాడలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా టార్గెట్ చేశారు. "కరోనా మనుషుల ప్రాణాలు తీస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు తీస్తోంది" అంటూ మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు రూ.2500, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. రైతుల సమస్యలు, యూరియా కొరత, వడ్ల కొనుగోళ్లలో ఆలస్యం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. "కేసీఆర్ హయాంలో రైతుబంధు ఆగలేదు.. కానీ ఇప్పుడు రైతు ఏడుస్తున్నాడు" అంటూ వ్యాఖ్యానించారు. "వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే.. కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులను వదిలిపెట్టం" అని హెచ్చరించారు.

**కరీంనగర్‌లో రాజకీయ ఉద్రిక్తత..**

**ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాలపై దాడుల ఆరోపణలు**

కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయాలపై బీజేపీ శ్రేణులు దాడి చేశారంటూ బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ ఘటనను హరీశ్




రావు తీవ్రంగా ఖండిస్తూ.. "ప్రజాప్రతినిధుల కార్యాలయాలపైనే దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా?" అని ప్రశ్నించారు. మరోవైపు కేటీఆర్ కూడా స్పందిస్తూ.. "కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉండి శాంతిభద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం దురదృష్టకరం" అన్నారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని ఆరోపించారు.

**సోషల్ మీడియాలో సెటైర్ల వర్షం**

**"సూసైడ్ స్టార్.. తంబాకు స్టార్.. ట్విట్టర్ ట్రోల్స్"**

రాజకీయ నాయకుల వ్యాఖ్యల కంటే సోషల్ మీడియాలో నడుస్తున్న ట్రోలింగ్ ఇప్పుడు మరింత హాట్ టాపిక్‌గా మారింది. "ఒక్కవైపు సూసైడ్ స్టార్.. మరోవైపు తంబాకు స్టార్.. మధ్యలో ట్విట్టర్ ట్రోల్స్" అంటూ నెటిజన్లు మీమ్స్, సెటైర్లు పేలుస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య పెరుగుతున్న మాటల యుద్ధం.. సోషల్ మీడియాలో కొత్త కొత్త ట్రెండ్‌లకు దారి తీస్తోంది.

**మోదీ సభ చుట్టూ రాజకీయ హీట్**

ఈనెల 10న జరగనున్న ప్రధాని మోదీ సభను భారీగా విజయవంతం చేయాలని బండి సంజయ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. "షోపుటప్ రాజకీయాలు వద్దు.. జనసమీకరణలో మీ దమ్ము చూపండి" అంటూ కార్యకర్తలకు సూచించారు. ఇక బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలనే ప్రధాన అజెండాగా తీసుకుని ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తోంది.

**తెలంగాణలో పొలిటికల్ వార్ పీక్స్‌కు..**

రాష్ట్రంలో మూడు ప్రధాన పార్టీల మధ్య మాటల తూటాలు, పరస్పర ఆరోపణలు, సోషల్ మీడియా ట్రోలింగ్.. అన్నీ కలిపి తెలంగాణ రాజకీయాలను మరింత హీటెక్కిస్తున్నాయి. మోదీ సభ, రైతు సమస్యలు, శాంతిభద్రతల అంశాలు.. రానున్న రోజుల్లో రాజకీయంగా మరింత చర్చనీయాంశం కానున్నాయి.

# కొండగట్టుకు అంజన్న స్వాముల పాదయాత్ర



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మండల కేంద్రానికి చెందిన 11 మంది మాల ధారణ భక్తులు గురువారం సాయంత్రం కొండగట్టుకు పాదయాత్రగా బయలు దేరారు.నాలుగు రోజులపాటు పాదయాత్రగా చేసి వేములవాడ మీదుగా 150 కిలోమీటర్లు పాదయాత్ర చేసి హనుమాన్ జయంతి నాటికి కొండగట్టుకు చేరుకోనున్నట్లు తెలిపారు.పాదయాత్రగా బయలుదేరిన హనుమాన్ భక్తులకు మంగళహారతులు, ప్రత్యేక పూజలతో కుటుంబ సభ్యులు వీడ్కోలు పలికారు.ఈ పాదయాత్రలో తీగల రాజు, పులి సాగర్, దొంతూరి సాయిచంద్, దొంతూరి సాయి కిరణ్,దొంతూరి రంజిత్, దొంతూరి బబ్లూ, దొంతూరి వికాస్,తీగల సిద్ధు,తీగల సన్నీ, వీరస్వామి, సోల్తి శ్రీ చరణ్ స్వాములు వెళుతున్నారు.

# సెన్సస్-2027 ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్

**హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌కు సన్నద్ధం కావాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**





**వరంగల్, 7 మే 2026(జై భీమ్ న్యూస్)**

సెన్సస్-2027 ఎన్యూమరేషన్ నిర్వహణపై హైదరాబాద్‌లోని సెన్సస్ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండల, మున్సిపల్ స్థాయి సెన్సస్ ఛార్జ్ అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సెల్ఫ్ ఎన్యూమరేషన్ పురోగతిని అధికారులు సమీక్షించారు. మే 11 నుంచి ప్రారంభంకానున్న హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌కు అవసరమైన సెన్సస్ మెటీరియల్‌ను ఎన్యూమరేటర్లకు సమయానికి అందజేయాలని సూచించారు. అవసరమైతే సాఫ్ట్ కాపీలు కూడా అందుబాటులో ఉంచాలని తెలిపారు. సెన్సస్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామాలు, పట్టణాల్లో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ సంధ్యారాణి, జిల్లా సెన్సస్ ఆఫీసర్ విజయలక్ష్మి, సీపీఓ మరియు అడిషనల్ సెన్సస్ ఆఫీసర్ చంద్రకళ, ఎస్‌వో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**





**చిల్పూర్ / జై భీమ్ న్యూస్ :**

బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ సీపీ గురువారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ ఉదయం చిల్పూర్ పోలీస్ స్టేషన్ కు పోలీస్ అధికారులు పోలీస్ కమిషనర్ కు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును సీపీ సిబ్బందిని పని తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు.చివరగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహనా కల్పించాలని,రోడ్డు ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని,అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పోగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీల్లో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీం శర్మ, సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఐ నవీన్ కుమార్ వున్నారు.

**చిల్పూర్ బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న సీపీ**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సిర్పూర్ లోని బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పోలీస్ కమిషనర్ కు తీర్థ ప్రసాదాలు స్వామివారి శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం ఆలయ విశిష్టతను, ప్రాముఖ్యత, ఆలయంలో జరిగే కార్యక్రమాల వివరాలను ఆలయ పూజారి పోలీస్ కమిషనర్ కు వివరించారు

# జగిత్యాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై స్టీఫెన్ రవీంద్ర మెరుపు తనిఖీలు





**జగిత్యాల (జై భీమ్ న్యూస్)**

"రైతు చెమటకు వెంటనే గౌరవం దక్కాలి" – ధాన్యం తూకం నుంచి రైతుల ఖాతాల్లో చెల్లింపుల వరకు వేగం పెంచాలని అధికారులకు కమిషనర్ స్ట్రాంగ్ వార్నింగ్ జగిత్యాల జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర గురువారం విస్తృత స్థాయిలో మెరుపు తనిఖీలు నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా ధాన్యం కొనుగోలు చేసి, చెల్లింపులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ కావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొడిమ్యాల మండలం పుదూర్‌లోని పాడి కొనుగోలు కేంద్రాన్ని (పీపీసీ ) సందర్శించిన కమిషనర్ అక్కడ జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. భౌతిక రికార్డులు, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలు, రైతులకు జరుగుతున్న చెల్లింపుల వివరాలను సమీక్షించారు. ధాన్యం తూకం ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని, రైతులు గంటల తరబడి వేచి ఉండే పరిస్థితులు రాకూడదని అధికారులను హెచ్చరించారు. అనంతరం గుణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సందర్శించిన స్టీఫెన్ రవీంద్ర, ధాన్యం లోడ్ల అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని మిల్ యాజమాన్యానికి సూచించారు. లారీల నిల్వలు పెరగకుండా తక్షణమే తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తర్వాత జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. జిల్లాలో లాజిస్టిక్స్, హ్యాండ్లింగ్ సామర్థ్యాలను పెంచి రైతులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ధాన్యం సేకరణ పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా రోజువారీ చెల్లింపు లక్ష్యాలను పెంచాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని పేర్కొన్న కమిషనర్, ఇప్పటివరకు మొత్తం 19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని తెలిపారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.2506 కోట్ల చెల్లింపులు విడుదల చేసినట్లు వెల్లడించారు.

# రాజకీయాలకు మతాలను అంటగడుతున్నారు

**దేవుళ్ళ పేర్లు చెప్పే నాయకులందరూ దయలేని పనులు చేస్తున్నారు**
**మతాల ముసుగు రాజకీయాలు తక్షణమే తొలగిపోవాలి**
**కేంద్ర నిధులపై నోరువిప్పని రాష్ట్ర ఎంపీలు**
**అయోధ్య రామున్ని అభిమానంగా కొలుస్తున్నోళ్లు భద్రాద్రి రామున్ని దర్శించారెందుకు?**
**తెలంగాణ దేవాలయాల అభివృద్ధి కోసం కోట్ల రూపాయల నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి**
**ప్రజల బతుకులు బాగుచేసినోడే దేవుళ్లను స్మరించాలి**
**రాజకీయాలు వేరు,మతాలు వేరు,మంత్రి వ్యాఖ్యలను వివాదాస్పదాలకు వాడుకుంటున్నారు**
**భగవంతునిపై భక్తిశ్రద్ధలు కలవారే ప్రజాసేవ చేస్తారు**



**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

దేవునిపై వ్యక్తిగత విశ్వాసం అనేది ఆత్మీయ సంబంధంతో కూడుకొనినదని తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యానించడం పూర్తిగా సమ్మతించనైనది. దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మత విద్వేషపూరితమైన రాజకీయాలను పాల్పడుతున్న ప్రతి రాజకీయ నాయకున్ని నిలదీసే విధంగా మంత్రి వ్యాఖ్యలు ఉన్నాయని తెలంగాణ ప్రజలు భావిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర దేవాలయాల అభివృద్ధి నిర్మాణల కోసం తెలంగాణలో ఉన్న బిజెపి కేంద్ర మంత్రులు కేంద్రం నుండి తెలంగాణ రాష్ట్రానికి నిధులు తీసుకురావాలని అనేక సందర్భాల్లో మంత్రి సురేఖ గుర్తు చేయడం తెలుగు ప్రజలకు గుర్తుంటునే ఉంది. అదే సందర్భంలో అయోధ్య రాముడు మాకు మాత్రమే చెందిన దేవుడని కొన్ని వర్గాలు కొంతమంది రాజకీయ ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేసుకుంటుండగా అయోధ్య రామమందిరాన్ని దర్శించుకోకపోవడానికి వెళుతున్న భక్తులపై దాడులు జరుగుతుండటం దైవభక్తి కలిగిన రాజకీయనేతలు ప్రశ్నించకపోవడం లేదని దాడులను దైవభక్తి రూపంలో ప్రేరేపించే విధంగా ఉంటుందన్న సంగతిని బలపరుస్తున్నట్లుగా ఉంది. దైవం పేరు చెప్పుకునే రాజకీయలు చేయడం ఏమాత్రం తగదని మంత్రి సురేఖ గుర్తు చేయడం దేశ ప్రజల ప్రయోజనం కోసమేనని గుర్తుకు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ప్రాముఖ్యంగా మారిపోయింది.తెలంగాణలో ఉన్న 12 మంది ఎంపీలు భద్రాద్రి రాముని కొనియాడకపోవడం భద్రాద్రి రామాలయాన్ని దర్శించకపోవడం దైవభక్తి కలిగిన వ్యక్తులు ఎందుకు ప్రశ్నించకపోవడంలేదంటూ తెలంగాణ ప్రజలు సూటిగా నిలదీస్తున్నారు.తెలంగాణ దేవదాయ శాఖ అభివృద్ధి కోసం నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వన్ని తెలంగాణ బిజెపీ ఎంపీలు ఎందుకు అడగడం లేదంటూ ప్రజలు సూటిగా నిలదీస్తున్నారు. మంత్రి సురేఖ వ్యాఖ్యలపై ఘాటు విమర్శలు చేస్తున్న విమర్శకులందరూ దేశవ్యాప్తంగా రాముని పేరు చెప్పి ఇతర మతస్తులపై ఇతర రాజకీయ పార్టీల ప్రజలపై ఎందుకు దాడులు చేస్తున్నారంటూ ప్రజలందరూ ప్రశ్నిస్తూనే ఉండగా దైవభక్తి పేరు మీద దాడులు చేయబడుతుండడం నిరంతరం ప్రక్రియలాగా సాగిపోతున్న సందర్భంలోనే మంత్రి సురేఖ దేవుళ్ళపై రాజకీయం చేయొద్దని మంచి మనసుతో మాట్లాడిన విధానాన్ని ప్రజలు గమనించాల్సి ఉంది. ప్రజా ప్రయోజనార్థం, రాష్ట్ర ప్రయోజనార్థం ప్రజల విశ్వాసాన్ని బలపరచడం కోసం దేవాలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్కు సహకరించని పార్టీలు గానీ,నాయకులు గాని మతం ముసుగు రాజకీయాలను కొన్ని సంవత్సరాల కాలం పాటుగా ప్రజలు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ఏది మాట్లాడిన తప్పులు వెతుకుతున్న సమాజంలో భగవంతుడు వేరు భక్తి వేరు రాజకీయాలు వేరు మనుషుల ఆత్మగౌరవాలు వేరు అనేది తెలంగాణ ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిగా కొండా సురేఖ సర్వమతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రజలందరి బాగోగులను యోగక్షేమాలను దైవభక్తిని పెంపొందించడం కోసం తీవ్రంగా కృషి చేస్తూనే దేవాలయాల అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉన్నారన్నది తెలుగు ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారు. రాజకీయ సమరహస్యత కొరకు మతపరమైన సమరాహాస్యత కొరకు భగవంతుడి స్వరూపాన్ని ఏమాత్రం ఉపయోగించుకోకూడదని రాష్ట్ర ప్రజలందరూ ముక్తకంఠంతో కోరుతున్నారు.

# సౌర విద్యుత్ పథకాలతో రైతులు ఆర్థికంగా లాభపడాలి : జిల్లా కలెక్టర్ డా. సత్య శారద






**వరంగల్, 07 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక (99 డేస్ యాక్షన్ ప్లాన్)లో భాగంగా నిర్వహిస్తున్న రైతు వారం కార్యక్రమంలో గురువారం ఫోర్ట్ వరంగల్ మండలంలోని ఈస్ట్ ఫోర్ట్‌లో రైతు అవగాహన సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యుత్ శాఖ -- టీజీఎన్పీడీసీల్ వరంగల్, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కుసుమ – ఏ, పీఎం కుసుమ – సి, పీఎం సూర్యఘర్ పథకాల ద్వారా రైతులు సౌర విద్యుత్ వినియోగాన్ని పెంపొందించుకుని ఆర్థికంగా లాభపడవచ్చని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ వినియోగం ద్వారా విద్యుత్ వ్యయం తగ్గడమే కాకుండా అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసి రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని ఆమె వివరించారు. సౌర విద్యుత్ వినియోగం పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్న కలెక్టర్, రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు మరియు వినియోగదారుల కోసం రూపొందించిన విద్యుత్ భద్రత అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. విద్యుత్ ప్రమాదాల నివారణలో భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరిస్తూ, విద్యుత్ లైన్ల సమీపంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, విద్యుత్ పరికరాలను సురక్షితంగా వినియోగించాలని సూచించారు. సమావేశంలో పీఎం – కుసుమ పథకాల అమలు విధానం, సౌర వ్యవసాయ పంపుసెట్ల ప్రయోజనాలు, విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యుత్ భద్రత మరియు టీజీఎన్పీడీసీల్ సేవలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కె. అనురాధ, మండల వ్యవసాయ అధికారి జి. విజ్ఞాన్, డా. శ్రావణ్, డా. హరి, వరంగల్ సీనియర్ సైంటిస్టులు రైతులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. అధిక లాభాలనిచ్చే ఆయిల్ పామ్ సాగు, పంట మార్పిడి విధానాలు, నానో యూరియా వినియోగం, ఎరువుల సమతుల్య యాజమాన్యం, పారాక్వాట్ వంటి నిషేధిత మందుల దుష్ప్రభావాలు, వరి కోతల అనంతరం వ్యర్థాలను తగులబెట్టకుండా భూమిలోనే కుళ్ళింపజేసే పద్ధతులు, సన్న రకపు వరి సాగు మరియు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎంపీడీసీఎల్ ఆనందం, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, రెడీకో జనరల్ మేనేజర్ రాజేందర్, ఎన్పీడీసీఎల్ ఎస్సీ వరంగల్ ఆనందం, జేడీ అగ్రికల్చర్ అనురాధ, డీఈ వరంగల్ మల్లికార్జున్, ఏడిఈ వరంగల్ కిషోర్, ఎఈ ఫోర్ట్ వరంగల్ రామకృష్ణ, విద్యుత్ శాఖ అధికారులు, రైతులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# వరంగల్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్స్పెక్టర్ల బదిలీ



In pursuance of the orders issued vide reference 1st cited above, the following Inspectors of Police of Warangal Police Commissionearte are transferred and posted to the places noted against them on administrative grounds with immediate effect.

| Sl. No. | Name of the Inspr of Police S/Sri | Present place of working | Now Posted to |
| --- | --- | --- | --- |
| 1 | Y.Sudhakar Reddy | SHO, Kazipet PS | Shyapet/Parkal Rural Circle, in place of Sri P.Ranjith Rao, Inspr, who is transferred to Sultanabad Circle of Ramagundam Commissionerate vide reference 2nd cited. |
| 2 | J.Shyamsunder | CCRB, Warangal attached to AHTU | SHO, Kazipet PS, vice Sri Y.Sudhakar Reddy, Inspr transferred out |
| 3 | A.Mahendser | PCR, Warangal | SHO, Hasanparthy PS, vice Sri V.Cheralu, Inspr transferred out |
| 4 | V.Cheralu | SHO, Hasanparthy PS | VR, Warangal |

The ACsP, CSB, CCRB, Parkal and Kazipet are requested to take necessary action accordingly and relieve the above Inspectors of Police immediately, with instructions to report at their new places and intimate the date of relief to this office.

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్స్ స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ప్రస్తుతం కాజీపేట ఇన్స్పెక్టర్గా నిర్వహిస్తున్న సుధాకర్ రెడ్డిని శాయంపేట సిఐ గా బదిలీ చేయగా, ఏ హెచ్ టి యు ఇన్స్ స్పెక్టర్ జె.. శ్యామ్ సుందర్ కాజీపేట కు, పిసిఆర్ లో పనిచేస్తున్న ఏ. మహేందర్ ను హసన్ పర్తికి, ప్రస్తుతం హసన్ పర్తిలో విధులు నిర్వహిస్తున్న వి. చేరాలు వి. ఆర్ బదిలీ అయ్యారు.

# మే 12న నర్సంపేటలో ఓంకార్ శతజయంతి ముగింపు బహిరంగ సభ జయప్రదం చేయండి

**ఎంసిపిఐ(యు) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి**



**నర్సంపేట / జై భీమ్ న్యూస్ :**

ప్రజా సంక్షేమం పేరుతో వినాశనకర విధానాలను అమలు చేస్తూ పెట్టుబడిదారులకు కార్పోరేట్ శక్తులకు దోచిపెడుతున్న పాలకులకు కమ్యూనిస్టు వామపక్ష సామాజిక శక్తుల ఐక్యతే ప్రత్యామ్నాయమని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి అన్నారు. ఈ క్రమంలో ఈనెల 12న నర్సంపేటలో జరిగే వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ ముగింపు బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు ఎంసిపిఐ(యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్ రెడ్డి హంస రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రచార ఆర్భాటం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని పత్తి పంట దెబ్బతిని దిగుబడి లేక అప్పుల పాలైన రైతాంగం జిల్లాలో లక్ష ఎకరాలలో మొక్కజొన్న పంటను పండించి మార్కెట్లో అమ్ముదామంటే కనీస మద్దతు ధర రాని పరిస్థితి నెలకొన్నదని ప్రభుత్వం అరకోరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తూ పరోక్షంగా ప్రైవేటు వ్యాపారులకు దళారులకు వత్తాసు పలుకుతూ అమ్ముకునే విధంగా చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతు వేదికల వద్ద కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మక్కల కొనుగోలను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాజకీయ పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు గోడ్డలి పెట్టు లాగా వారి వ్యక్తి స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని సంపద అందరికీ కాకుండా కొందరికే చెందే విధంగా ప్రశ్నిస్తే అణిచివేతకు గురయ్యే విధంగా చట్టాల రూపకల్పన జరుగుతున్నదని ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ విలువలను త్యాగాలను ఆదర్శాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందుకోసం కమ్యూనిస్టులు వామపక్ష సామాజిక శక్తులు ఐక్యం కావాలని అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ బలంగా కోరుకున్నాడని ఆ క్రమంలో తన వంతు ప్రయత్నాన్ని నిరంతరం కొనసాగించాడని వారి ఆశయాలను ముందు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని అందులో భాగంగా కామ్రేడ్ ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ముగింపు సభను మే 12న నర్సంపేట పట్టణంలోని సిటిజెన్ క్లబ్ ఆవరణలో జరుపుతున్నట్లు దీనికి పార్టీ జాతీయ రాష్ట్ర నాయకత్వం వివిధ కమ్యూనిస్టు వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు హాజరై ప్రసంగిస్తారని కావున ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి నీల రవీందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున కర్ర రాజిరెడ్డి, మాస్ సావిత్రి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీపురు ఓధయ్య,జిల్లా కమిటీ సభ్యులు మొగిలి శ్రీనివాసరావు పార్టీ నాయకులు అన్న పైన ప్రేమలత, కళావతి సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌పై క్రిమినల్ కేసు నమోదు

**రైతు సంగ్రామ సదస్సు వేదికగా రాహుల్, రేవంత్ లపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు**
**కేటీఆర్ వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయంటూ కాంగ్రెస్ నేతల ఫిర్యాదు**
**బీఎన్ఎస్ సెక్షన్లు 504, 505 కింద కేసు నమోదు చేసిన పోలీసులు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై వరంగల్‌లో క్రిమినల్ కేసులు నమోదు కావడం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఉత్కంఠ రేపుతోంది. హన్మకొండ 'రైతు సంగ్రామ సదస్సు' వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చట్టపరమైన చిక్కులకు దారితీశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు అనుచితంగా ఉన్నాయని కాంగ్రెస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి తదితరుల ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కేటీఆర్‌పై బీఎన్ఎస్ (దీచీూ) యాక్ట్‌లోని సెక్షన్ 504 (శాంతి భంగం కలిగించేలా ఉద్దేశపూర్వకంగా అవమానించడం), సెక్షన్ 505 (ప్రజా విద్వేషాన్ని ప్రేరేపించే ప్రకటనలు చేయడం) కింద కేసులు నమోదు చేశారు.

# మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం

**అంతర్జాతీయ మాజీ హాకీ కోచ్ మధుకరన్**




**హన్మకొండ, 07 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో హాకీ క్రీడకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, క్రీడలు యువతకు నూతన ఉత్తేజంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అంతర్జాతీయ మాజీ హాకీ కోచ్ మధుకరన్ పేర్కొన్నారు. హనుమకొండ నయీమ్‌నగర్ హాకీ గ్రౌండ్‌లో, పాత ఆర్టీఓ కార్యాలయం వెనుక జరుగుతున్న హాకీ వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఆయన క్రీడాకారులకు దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో క్రీడా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. విజయం సాధించాలంటే రోజువారీ ప్రాక్టీస్‌తో పాటు ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. నేటి యువ క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. హాకీ క్రీడాకారుల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని, ప్రతి క్రీడాకారుడికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నయీమ్‌నగర్ హాకీ క్లబ్ సీనియర్, జూనియర్ క్రీడాకారులతో పాటు క్లబ్ పిల్లల తల్లిదండ్రులతో కమిటీ ఏర్పాటు చేశారు. హాకీ వేసవి శిక్షణ శిబిరం సందర్భంగా క్రీడాకారులు మధుకరన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివరాం, ఉస్మాన్, సుజీత్, రాహుల్, సంతోష్, అనుదీప్, శివానందిని తదితరులు పాల్గొన్నారు.

# సైకాలజీస్టుల చరిత్ర గణనీయం

**పేదల సేవలో ప్రతిభను కనపరుస్తున్నారు**
**10 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తున్నారు**
**పేద కుటుంబాలకు పెద్దదిక్కుగా నిలుస్తున్నారు**
**సైకాలజి అసోసియేషన్10 సంవత్సరాలు పూర్తి చేసుకుంది**
**పదవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు**







**హన్మకొండ జై భీమ్ న్యూస్**

తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ పదవ వార్షికోత్సవం సందర్భంగా వేడుకలు సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది.రాష్ట్రవ్యాప్తంగా సైకాలజిస్టుల అసోసియేషన్ కు ఇక్కడ లేని ఆదరణ లభిస్తుందని అసోసియేషన్ సభ్యులు తెలియజేస్తున్నారు.10 సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు మానసిక వైద్యాన్ని అందించడం కోసం ఎంతో కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ సైకాలజిస్ట్ లా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీధర్ హనుమకొండ జిల్లా ప్రెసిడెంట్ శ్రీవిద్య అధ్యక్షతన సెక్రటరీ విక్రమ్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం శివుడు ట్రెజరర్ జగన్మోహన్ ఉమెన్ వైస్ ప్రెసిడెంట్ కళ్యాణి ఈసీ మెంబర్ సునీత హరి ప్రసాద్ ఇంకా సభ్యులు సామాన్య ప్రజలు పాల్గొన్నారు అధ్యక్షురాలు శ్రీవిద్య మాట్లాడుతూ తెలంగాణ సైకాలజిస్టులు అసోసియేషన్ వ్యవస్థాపించబడి 10 సంవత్సరాలు అయిందని ఈ అసోసియేషన్కు రాష్ట్ర అధ్యక్షునిగా మోతుకూరి రామచంద్ర వ్యవస్థాపించారని ఆయన ఎన్నో రకాల నిర్విరామ కృషి వల్ల సైకాలజీ టు ది సేవలను సామాన్య ప్రజలకు అందించుటకై రకరకాల సేవా కార్యక్రమాలుకు శ్రీకారం చుట్టడం జరిగింది అందులో ముఖ్యంగా వరల్డ్ మెంటల్ హెల్త్ డే , సూసైడ్ ప్రివెన్షన్ డే , అంతేకాకుండా స్కూళ్లలో పాఠశాలలో సైకాలజిస్టులచే మోటివేషన్ క్లాసులు వృద్ధాశ్రమాలలో సేవ, తదితర అంశాలతో సమాజంలోకి సైకాలజిస్టుల సేవలు కొనసాగుటకై అసోసియేషన్ ముందుకు వస్తుందని తెలియజేయడం జరిగింది

# హనుమకొండలో రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా







**ఘనంగా ముగింపు**
**రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హన్మకొండ / జై భీమ్ న్యూస్ :**

హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా గురువారంతో ఘనంగా ముగిసింది. ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు నిర్వహించిన ఈ మేళా ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, పంటల వైవిధ్యీకరణ మరియు ప్రత్యామ్నాయ సాగు విధానాలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. మేళా మూడో రోజు నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి, రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యంత్రాలు, పంటల సంరక్షణ పద్ధతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె.ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, రాష్ట్ర హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హనుమకొండ ,వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో అతిథులు రైతులకు పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు మరియు రైతు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. సభను ఉద్దేశించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, మూడు రోజులపాటు నిర్వహించిన ఈ అవగాహన సదస్సు రైతుల్లో కొత్త ఆలోచనలకు దారి తీసిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయంలో నూతన పద్ధతులను అనుసరించాలని, వ్యవసాయ అధికారులు మరియు శాస్త్రవేత్తల సూచనలను పాటించి అభివృద్ధి సాధించాలని రైతులకు పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. గతంలో రైతు రుణమాఫీ అమలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఎన్నికల హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేపట్టినట్లు తెలిపారు. అలాగే సన్నబియ్యం రేషన్ పంపిణీ వంటి పథకాల ద్వారా రైతు, పేద ప్రజలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. ప్రతిపక్షాలు రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు.

# రైతన్నే దేశానికి అన్నం పెట్టే గొప్ప వ్యక్తి







**రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం**
**రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది**
**రైతు రుణమాఫీ చేయని వారు విమర్శలు చేయడం సిగ్గుచేటు**
**సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొస్తున్నారు**
**వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**హనుమకొండ / జై భీమ్ న్యూస్ :**


రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళాకు హాజరైన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం-- వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హాజరయ్యారు. అంతకుముందు హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు చేరుకున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మెగా రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, సాంకేతిక స్టాళ్లను సందర్శించి రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతలు, పథకాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చెమటోడ్చి భూమిలో విత్తనాలు నాటి, వాటిని పంటలుగా మార్చి దేశానికి అన్నం పెడుతున్న గొప్ప వ్యక్తి రైతన్న అని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. రైతు కష్టానికి గౌరవం ఇచ్చే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసి రైతులకు ఊరటనిచ్చిందన్నారు. రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, ఇందుకోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు. వ్యవసాయ పనిముట్లపై 50 శాతం సబ్సిడీ అందిస్తూ రైతుల భారం తగ్గిస్తున్నామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోందని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్ర స్థాయి రైతు ప్రణాళికలో భాగంగా ఆయిల్ ఫామ్ సాగుకు బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామని తెలిపారు. రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకే ఇలాంటి మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నామని, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమనించి రైతులు పంటల మార్పిడి విధానాలను అనుసరించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలు నిజం తెలుసుకోవాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను పదేపదే కలిసి ప్రత్యేక నిధులు తీసుకువస్తూ తెలంగాణకు మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. నిలిచిపోయిన స్టార్టప్ సెంటర్లకు పునర్జీవం పోసి, కేంద్రం నుంచి వేల కోట్ల నిధులు వచ్చేలా కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతుల మధ్యకు వచ్చి అవగాహన కల్పించడం అభినందనీయమని, దీని ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ కూడా పూర్తిగా అమలు చేయలేదని, ఇప్పుడు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని ప్రతిపక్షాలపై ఎంపీ మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్ లు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, అధికారులు, పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.10 లక్షల లంచం డిమాండ్..

**ఏసీబీ వలలో అటవీ శాఖ అధికారులు**

**భద్రాద్రి కొత్తగూడెం, 7 మే 2026(జై భీమ్ న్యూస్)**

భద్రాచలం అటవీ శాఖలో అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత, చర్ల ఇన్‌చార్జ్ డీఆర్‌వో కృష్ణయ్య గురువారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. బాధితుడి నుంచి రూ.3.5 లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించబడినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి జిల్లా చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని చెట్లను తొలగించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భద్రాచలం ఎఫ్‌డీవో సుజాత రూ.10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో వారు పక్కా ప్రణాళికతో ఉచ్చుపన్నారు. గురువారం ఉదయం తొలి విడతగా రూ.3.5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి ఎఫ్‌డీవో సుజాతతో పాటు చర్ల అటవీ శాఖ ఇన్‌చార్జ్ అధికారి కృష్ణయ్యను పట్టుకున్నారు. ఈ ఘటనతో అటవీ శాఖలో కలకలం రేగింది. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# వరంగల్‌లో మెగా జాబ్ మేళా 2026

**68 కంపెనీలతో వేలాది ఉద్యోగ అవకాశాలు**
**మే 8న కాళోజి కళాక్షేత్రంలో నిర్వహణ**
**యువత సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి కొండా సురేఖ**

**వరంగల్, 07 మే 2026(జై భీమ్ న్యూస్)**

ఉమ్మడి వరంగల్ జిల్లా నిరుద్యోగ యువతకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో “తెలంగాణ జాబ్ మేళా--2026”ను ఘనంగా నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం, టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్), డీట్ మరియు సంబంధిత శాఖల ఆధ్వర్యంలో మే 8వ తేదీన హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో ఈ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ ఐటీ, తయారీ, బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్‌కేర్, ఈ-కామర్స్, సర్వీస్, రిటైల్, టెలికాం, లాజిస్టిక్స్, అగ్రిటెక్ తదితర రంగాలకు చెందిన మొత్తం 68 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలతో కలిసి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. చదువుకు తగిన ఉద్యోగ అవకాశాలు యువతకు అందేలా ఇలాంటి మెగా జాబ్ మేళాలు దోహదపడతాయని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఈ జాబ్ మేళా ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంఎస్సీ, ఫార్మసీ, ఇంజినీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అభ్యర్థులకు వివిధ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.



మహిళలు, పురుషులు ఇద్దరికీ అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండనున్నాయి. ఐటీ, ఐటీఈఎస్ రంగంలో 10000కోడర్స్, వెల్త్ జోన్ టెక్నాలజీస్, ఓహో ఇండియా లైఫ్ టెక్ వంటి సంస్థలు ట్రైనీ,ా× రీసెర్చ్ అనలిస్ట్, డిజిటల్ మార్కెటింగ్ ఇంటర్న్, మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు నియామకాలు చేపట్టనున్నాయి. ఎఐ మరియు డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో నైపుణ్యం కలిగిన యువతకు మంచి అవకాశాలు ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. తయారీ రంగంలో హెటెరో గ్రూప్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎంఆర్ఎఫ్, రెడాక్స్ ల్యాబొరేటరీస్, కోవాలెంట్ ల్యాబ్స్, ఫన్ ఫస్ట్, ఎస్టర్ ఇండస్ట్రీస్, హానర్ ల్యాబ్ వంటి సంస్థలు ప్రొడక్షన్ అసిస్టెంట్, అసెంబ్లీ ఆపరేటర్, క్వాలిటీ కంట్రోల్, మాన్యుఫాక్చరింగ్ అసోసియేట్, జూనియర్ కెమిస్ట్ పోస్టులకు భారీగా నియామకాలు చేపట్టనున్నాయి. సర్వీస్, ఈ-కామర్స్ రంగాల్లో బిగ్ బాస్కెట్, జెప్టో, టీమ్‌లీజ్, కవాచ్ హెచ్ఆర్, అజెడ్ ఫెసిలిటీ సర్వీసెస్, డిజిటైడ్ సొల్యూషన్స్ వంటి సంస్థలు పికర్ ఢ ప్యాకర్, డెలివరీ హబ్ అసోసియేట్, ప్రొడక్ట్ స్కానింగ్ అసోసియేట్, కస్టమర్ కేర్, లాజిస్టిక్స్ పోస్టులకు ఉద్యోగులను ఎంపిక చేయనున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల్లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఇండసిండ్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, మణిపాల్ బిఎఫ్ఎస్ఐ, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి సంస్థలు సేల్స్ ఆఫీసర్, రిలేషన్‌షిప్ మేనేజర్, బ్యాంకర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నియామకాలు చేపట్టనున్నాయి. ఫార్మా, హెల్త్‌కేర్ రంగాల్లో అపోలో ఫార్మసీ, మెడ్‌ప్లస్, కాల్ హెల్త్ సర్వీసెస్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, లైఫ్ సైన్సెస్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వంటి సంస్థలు ఫార్మసిస్ట్, నర్సులు, కేర్ గివర్స్, ఫార్మా టెక్నీషియన్, మైక్రోబయాలజీ క్వాలిటీ కంట్రోల్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. అదేవిధంగా మ్యానుఫ్యాక్చరింగ్, డిజిటల్ మీడియా, హెల్త్ కేర్, బిజినెస్ సర్వీసెస్, లాజిస్టిక్స్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, కస్టమర్ కేర్, హాస్పిటాలిటీ, మార్కెటింగ్, టెలికాలింగ్, ఫీల్డ్ సేల్స్, బీపీఓ, ఎలక్ట్రిషియన్, ఆటోమొబైల్, అగ్రిటెక్ తదితర రంగాల్లో కూడా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు కనిష్టంగా రూ.18 వేల నుంచి గరిష్టంగా రూ.8 లక్షల వరకు వార్షిక వేతన ప్యాకేజీలు అందనున్నట్లు సమాచారం. కొంతమంది అభ్యర్థులకు ఇంటర్వ్యూల అనంతరం నేరుగా నియామక పత్రాలు కూడా అందజేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఈ మెగా జాబ్ మేళాకు ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, నవీకరించిన బయోడేటాతో నేరుగా హాజరుకావాలని మంత్రి కొండా సురేఖ కోరారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ మెగా జాబ్ మేళా కీలకంగా మారనుందని అధికారులు పేర్కొన్నారు.

## మూగ జీవాల స్మగ్లర్ల అరెస్టులో ప్రతిభ కనబరిచిన ఖానాపూర్ ఎస్సైకి నగదు పురస్కారం



**వరంగల్, 7 మే 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

మూగ జీవాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఖానాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్సై జి. రామ్మోహన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు. గురువారం వరంగల్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై రామ్మోహన్‌కు నగదు రివార్డును అందజేసి ప్రశంసించారు. మూగ జీవాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఖానాపూర్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు కీలక సమాచారం సేకరించినందుకు పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ నేర నియంత్రణలో మెరుగైన ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తామని సీపీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వెస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ కూడా ఎస్సై రామ్మోహన్ సేవలను అభినందించారు. సమాజంలో అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో పోలీసుల పాత్ర కీలకమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

## పెళ్లింట విషాదం..

**హల్దీ వాగులో మునిగి ముగ్గురు యువకుల మృతి**
**సిద్దిపేట జిల్లాలో వర్గల్ మండలం నాచారం గ్రామ సమీపంలో ఘటన**
**హల్దీ వాగులో ఈతకు వెళ్లి ముగ్గురు యువకుల మృతి**
**మృతులు మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన వారుగా గుర్తింపు**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

వివాహ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ముగ్గురు యువకులు హల్దీ వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో పెళ్లింట సంతోషం స్థానంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాల్లోకి వెళితే, మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన పెళ్లి బృందం బుధవారం ఓ వివాహ వేడుక కోసం సిద్దిపేట జిల్లా తూప్రాన్‌కు వెళ్లింది. వేడుక ముగిశాక వారిలో కొంతమంది యువకులు సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం గ్రామానికి వచ్చారు. ఇక్కడి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న అనంతరం, సరదాగా ఈత కొట్టేందుకు సమీపంలోని హల్దీ వాగులోకి దిగారు. అయితే, వాగు లోతును అంచనా వేయడంలో విఫలమవడంతో ముగ్గురూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. స్థానికులు గమనించి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ముగ్గురి మృతదేహాలను గుర్తించి బయటకు తీశారు. మృతులను ప్రశాంత్, వికాస్, కొంతమి ఆనంద్ రెడ్డిగా పోలీసులు గుర్తించారు. వివాహ వేడుకకు వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారి కుటుంబాల్లో, బంధుమిత్రుల్లో తీవ్ర విషాదం నెలకొంది.

## విజయ్ గెలుపు రహస్యం చెప్పిన తెలంగాణ మంత్రి వివేక్

**తమిళనాడులో విజయ్ గెలుపుపై మంత్రి వివేక్ వ్యాఖ్యలు**
**సోషల్ మీడియా రీల్స్ కూడా విజయ్ గెలుపునకు కారణమన్న వివేక్**
**యువ నాటకోత్సవాల వేదికగా ఆసక్తికర విశ్లేషణ**
**కళలకున్న శక్తికి విజయ్ గెలుపే నిదర్శనమని వెల్లడి**
**పాఠశాలల్లో సంగీతం, నాట్యం కోర్సులుండాలని సూచన**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**


తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ సృష్టించిన ప్రభంజనంపై తెలంగాణ కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విజయ్ అద్భుత విజయానికి సోషల్ మీడియాలో చేసిన ‘రీల్స్’ కూడా ఎంతగానో దోహదపడ్డాయని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ‘యువ నాటకోత్సవాలు’ ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వివేక్ మాట్లాడుతూ.. కళలకు ఎంతో శక్తి ఉందని, అందుకు తమిళనాడు ఎన్నికల్లో విజయ్ సాధించిన విజయమే నిదర్శనమని అన్నారు. వినూత్నంగా ఆలోచిస్తే విజయం తథ్యమని, సోషల్ మీడియా ప్రభావం ఆ స్థాయిలో ఉందని పేర్కొన్నారు. కళారంగం, నాటక రంగంలోకి యువతరం రావాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన తమిళనాడు ఎన్నికల్లో దశాబ్దాలుగా పాతుకుపోయిన డీఎంకే, ఏఐఏడీఎంకేలను వెనక్కి నెట్టి టీవీకే పార్టీ అనూహ్య విజయం సాధించింది. మొత్తం 234 స్థానాలకు గాను 108 స్థానాలను కైవసం చేసుకుని అధికారానికి చేరువైంది. 2024లో పార్టీని స్థాపించిన రెండేళ్లకే విజయ్ ఈ ఘనత సాధించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో కళలను ప్రోత్సహించేందుకు పాఠశాల స్థాయి నుంచే సంగీతం, నాట్యం, నాటకం వంటి అంశాల్లో ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి వివేక్ సూచించారు.

## పరిగిలో పందుల గొడవ..

### కత్తితో యువకుడి వీరంగం

**వికారాబాద్ జిల్లా పరిగిలో పందుల విషయమై తీవ్ర గొడవ**
**పందుల పెంపకందారుడిపై కత్తితో దాడికి యత్నించిన యువకుడు**
**స్థానికులు అడ్డుకోవడంతో తప్పిన ముప్పు**
**కేసు నమోదు కాకముందే రాజీ చేసేందుకు రాజకీయ నేతల రంగప్రవేశం**

**వికారాబాద్, జై భీమ్ న్యూస్**



వికారాబాద్ జిల్లాలోని పరిగి పట్టణంలో ఓ యువకుడు కత్తితో హల్ చల్ చేయడం తీవ్ర కలకలాన్ని రేపింది. వీధి పందుల విషయంలో తలెత్తిన ఓ చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, కత్తితో దాడి చేసుకునే స్థాయికి చేరింది. ఓ యువకుడు పట్టపగలు కత్తితో వీరంగం సృష్టించడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. వివరాల్లోకి వెళితే, పరిగి బీసీ కాలనీకి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి పందులను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే, గత కొన్ని రోజులుగా తన పందులు చనిపోతుండటంతో, కాలనీ వాసులే కారణమని అతను అనుమానించాడు. ఈ విషయమై స్థానిక యువకులతో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో మాట మాట పెరిగి పరస్పర దూషణలకు దారితీసింది. ఈ వాగ్వాదంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఓ యువకుడు, తన ఇంట్లోకి వెళ్లి పెద్ద కత్తితో తిరిగి వచ్చాడు. వెంకటేశ్‌ను చంపేస్తానంటూ ఆయనపైకి దూసుకెళ్లాడు. దీంతో కాలనీవాసులు భయాందోళనలకు గురై పరుగులు తీశారు. అయితే, అక్కడే ఉన్న కొందరు యువకులు వెంటనే అప్రమత్తమై, కత్తితో ఉన్న యువకుడిని పట్టుకోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందినప్పటికీ, వారు కేసు నమోదు చేయకముందే స్థానిక రాజకీయ నాయకులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి, వివాదాన్ని సద్దుమణిగేలా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సమాచారం. పట్టపగలు జరిగిన ఈ ఘటనతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## భార్యను వెంటాడి నడిరోడ్డుపై కత్తితో పొడిచి చంపిన భర్త

**సూర్యాపేట, జై భీమ్ న్యూస్**

సూర్యాపేట జిల్లా కోదాడలో దారుణం చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యను ఓ భర్త నడిరోడ్డుపై అందరూ చూస్తుండగానే కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. బుధవారం రాత్రి కోదాడ బస్టాండ్ వద్ద ఈ ఘోరం జరిగింది. పోలీసులతో కౌన్సెలింగ్ తీసుకుని బయటకు వచ్చిన కొద్దిసేపటికే ఈ దారుణానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. కోదాడలోని బాబునగర్‌కు చెందిన మణిదీప్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు చెందిన శిరీష (24)ను ఆరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం జరిగిన గొడవతో బుధవారం శిరీష, ఆమె పెద్దమ్మ, మణిదీప్ కోదాడ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు. అయితే, పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చాక ఈ ఘోరం జరిగింది. జగ్గయ్యపేట వెళ్లేందుకు పెద్దమ్మతో కలిసి శిరీష ఆటో ఎక్కగా, మణిదీప్ ఆమెను బలవంతంగా బయటకు లాగాడు. ప్రాణభయంతో ఆమె సమీపంలోని టీ స్టాల్‌లోకి పరుగెత్తగా కత్తితో వెంటాడి విచక్షణారహితంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న శిరీషను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ దాడి దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

## ఉపరితల ద్రోణి.. రెండు తెలుగు రాష్ట్రాలకు 3 రోజుల పాటు వర్ష సూచన

**కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు**
**ద్రోణి ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని వెల్లడించిన వాతావరణ శాఖ**
**ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనాన్ని కలిగించే వార్త చెప్పింది. కర్ణాటక నుండి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పుల వల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి, వాతావరణం చల్లబడే అవకాశం ఉంది. తెలంగాణ విషయానికి వస్తే... జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాల వర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు తమ కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు.

## వడ్డీలేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు

**తెలంగాణ ప్రభుత్వం శుభవార్త**
**మహిళా స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాలు**
**రూ.10 లక్షల రుణానికి వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందన్న సీతక్క**
**2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.25,228 కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు వెల్లడి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మహిళా స్వయం సహాయక బృందాలకు ఇస్తున్న వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. స్వయం సహాయక బృందాలు తీసుకునే రూ.10 లక్షల రుణానికి సంబంధించిన వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. మహిళా స్వయం సహాయక బృందాలకు ఇచ్చే బ్యాంకు వార్షిక రుణ ప్రణాళికను ఈరోజు ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక బృందాల సభ్యులకు రూ.25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు సీతక్క తెలిపారు. మహిళా సంఘాల రుణాల వడ్డీ కోసం రూ.2,500 కోట్లు వ్యయం చేస్తామని వెల్లడించారు. ‘మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి’ అనే నినాదంతో ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి పరిపూర్ణమవుతుందని వ్యాఖ్యానించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేసే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీతక్క తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# గంగుల కమలాకర్ కార్యాలయం వద్ద దాడి

**కౌశిక్ రెడ్డి కారు ధ్వంసం !**
**బండి సంజయ్ పై వ్యక్తిగత విమర్శలకు దిగిన కౌశిక్ రెడ్డి**
**డ్రగ్స్ తీసుకోవడం వల్ల సంజయ్ కు బట్టతల వచ్చిందని తీవ్ర వ్యాఖ్యలు**
**కౌశిక్ కారు అద్దాలను ధ్వంసం చేసిన బీజేపీ కార్యకర్తలు**



**కరీంనగర్, జై భీమ్ న్యూస్**

కరీంనగర్ రాజకీయం ఒక్కసారిగా సెగలు పుట్టిస్తోంది. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీసు వద్ద చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మీడియా సమావేశంలో బండి సంజయ్‌పై వ్యక్తిగత విమర్శలకు దిగారు. బండి సంజయ్‌కు డ్రగ్స్ అలవాటు ఉందని, తంబాకులో డ్రగ్స్ కలిపి తీసుకోవడం వల్లే ఆయనకు బట్టతల వచ్చిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, డ్రగ్స్ టెస్టుకు తాము సిద్ధమని, బండి సంజయ్ కూడా రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల ఖర్చు కోసం గతంలో భార్య పుస్తెలు అమ్మినట్లు చెప్పిన సంజయ్, ఇప్పుడు వేల కోట్లు ఎక్కడి నుంచి తెస్తున్నారని ప్రశ్నించారు. వ్యాఖ్యలతో ఆగ్రహించిన బీజేపీ కార్యకర్తలు భారీ సంఖ్యలో గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీసును ముట్టడించారు. కౌశిక్ రెడ్డి లోపల ప్రెస్ మీట్ నిర్వహిస్తుండగానే, బయట ఉన్న ఆయన కారుపై దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశారు. అంతేకాకుండా, క్యాంప్ ఆఫీసులోని ఫర్నిచర్‌ను కూడా ధ్వంసం చేశారు. బండి సంజయ్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. పరిస్థితి అదుపు తప్పుతుండటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. క్యాంప్ ఆఫీసు ముట్టడికి ప్రయత్నించిన బీజేపీ శ్రేణులను అడ్డుకోవడానికి లాఠీచార్జ్ చేశారు. ఈ తోపులాటలో పలువురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. ప్రస్తుతం కరీంనగర్ పట్టణంలో అదనపు పోలీస్ బలగాలను మోహరించి నిఘాను పెంచారు. గంగుల ఆఫీసు వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు

**హరీశ్ రావు ఆగ్రహం**
**వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన**
**నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శ**
**తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపణ**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెల ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితిని తెలంగాణలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు. నేను వారిలా ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదని విమర్శించారు. రైతుల మధ్య నిల్చుని, వారి గోడు విని మాట్లాడుతున్నానని అన్నారు. కల్లాలలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచులకు వారం రోజులు, కాంటా (తూకం) పెట్టడానికి మరో వారం రోజులు పడుతుందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీకి నాలుగైదు బస్తాల వరకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని హరీశ్ రావు అన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే కనుక వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తరుగు పెడితే తోలు తీస్తామని గతంలో సీఎం చెప్పారని, ఇప్పుడు బస్తాకు రెండు మూడు కిలోల తరుగు తీస్తుంటే ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

## పక్కా ప్లాన్ తో నాపై హత్యాయత్నం చేశారు: కౌశిక్ రెడ్డి

**కరీంనగర్ లో కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బీజేపీ శ్రేణులు**
**కర్రలు, కత్తులు, పెట్రో బాంబులతో దాడి చేశారన్న కౌశిక్**
**తనను చంపే అవకాశం ఉందని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని మండిపాటు**



**కరీంనగర్, జై భీమ్ న్యూస్**

కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేశారు. ఈ దాడి అనంతరం కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ... తనను పక్కా ప్లాన్ తో హత్య చేసేందుకు యత్నించారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇద్దరూ కుమ్మక్కయ్యారని కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. తనపై జరిగిన దాడి వెనుక వీరిద్దరి వ్యూహం ఉందని, ఈ ఘటనతో వారిద్దరూ ఒక్కటేనని తేలిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. తనపై ముందే రెక్కీ నిర్వహించారని, చంపే అవకాశం ఉందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తలు కర్రలు, కత్తులు, పెట్రో బాంబులతో తనపై దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఒక శాసనసభ్యుడికే రక్షణ లేని పరిస్థితి కరీంనగర్‌లో ఉంటే, సామాన్యుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. పట్టణంలో గన్ కల్చర్‌ను ప్రోత్సహించడం సరికాదని, దొంగతనాలను ప్రశ్నించినందుకే తనను టార్గెట్ చేశారని పేర్కొన్నారు. కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని చెప్పడమే తాను చేసిన తప్పా? అని ఆయన ప్రశ్నించారు. తాను రెచ్చగొట్టానని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు.

## టీటీడీ ప్రాణదాన ట్రస్ట్ కు భారీ విరాళం

**తిరుమల, జై భీమ్ న్యూస్**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు భారీ విరాళం అందింది. కోల్?కతాకు చెందిన హిమాద్రి ఫౌండేషన్ సంస్థ రూ. 2.50 కోట్లను విరాళంగా అందజేసింది. తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో నిన్న ఈ కార్యక్రమం జరిగింది. హిమాద్రి ఫౌండేషన్ ట్రస్టీ అనురాగ్ చౌదరి, ఈ విరాళానికి సంబంధించిన రూ. 2.50 కోట్ల డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)ను టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. "పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఈ నిధులు ఎంతో ఉపయుక్తమవుతాయని" ఆయన వివరించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేద రోగులకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించేందుకు టీటీడీ ఈ ట్రస్టును నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, సదాశివరావు, జంగా కృష్ణమూర్తి, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి..

**స్పందించిన బండి సంజయ్**
**బీఆర్ఎస్ నాయకులు మితిమీరిన అహంకారంతో ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం**
**తమ కార్యకర్తల సహనం పరీక్షించవద్దన్న బండి సంజయ్**
**దాడులు, దౌర్జన్యాలు తమ సంస్కృతి కాదన్న బండి సంజయ్**



**కరీంనగర్, జై భీమ్ న్యూస్**

కరీంనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద జరిగిన దాడి ఘటనపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. బీఆర్ఎస్ నాయకులు మితిమీరిన అహంకారంతో ప్రవర్తిస్తున్నారని, తమ కార్యకర్తలకు కూడా సహనం ఉంటుందని, కానీ ఆ సహనాన్ని పిరికితనంగా భావించవద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరిగిన విషయం తనకు ఆలస్యంగా తెలిసిందని అన్నారు. దాడులు చేయడం, దౌర్జన్యాలకు దిగడం తమ సంస్కృతి కాదని అన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు తమ సహనాన్ని పరీక్షించవద్దని బండి సంజయ్ అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతల నీతి వ్యాఖ్యలు చూస్తుంటే నవ్వొస్తుందని అన్నారు. పదేళ్లలో ఆ పార్టీ చేసిన అరాచకాలను ప్రజలు మరిచిపోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలన రజాకార్లను తలపించిందని ఆరోపించారు. దాడుల సంస్కృతిని ఆ పార్టీయే ఆరంభించిందని విమర్శించారు. గతంలో తాను చేపట్టిన ప్రజాసంగ్రామయాత్రను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నో ఇబ్బందులు సృష్టించాయని అన్నారు. నాడు పదుల సంఖ్యలో కార్లను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. మహిళా కార్యకర్తలపై కూడా దాడులు చేశారని ధ్వజమెత్తారు. గతంలో చేసిన దాడులను మరిచిపోయి ఇప్పుడు సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారని బండి సంజయ్ అన్నారు.

## మంత్రి కొండా సురేఖ 'జైశ్రీరామ్' వ్యాఖ్యలపై రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం

**కొండా సురేఖ ఏ శాఖకు మంత్రో గుర్తుంచుకోవాలన్న రాజాసింగ్**
**జైశ్రీరామ్ అంటే కొండంత బలం వస్తుందన్న రాజాసింగ్**
**రేవంత్ రెడ్డి ఆమెను పిలిపించి రాజీనామా కోరాలని డిమాండ్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు 'జైశ్రీరామ్' అన్నారని, మరి తన కేబినెట్ మంత్రికి దానిని నేర్పించలేదా అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. 'జైశ్రీరామ్' అంటే పైనుంచి డబ్బులు రాలుతాయా అని ప్రశ్నించిన మంత్రి కొండా సురేఖపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి అంటే దేవుడికి అనుకూలంగా ఉండాలని, కానీ కొండా సురేఖ మాత్రం భిన్నంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కొండా సురేఖ ఏ శాఖకు మంత్రో గుర్తుంచుకోవాలని హితవు పలికారు. జైశ్రీరామ్ అంటే కొండంత బలం వస్తుందని, కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి ఊడిపోతుందని ముఖ్యమంత్రి ఆమెకు చెప్పాలని సూచించారు. కొండా సురేఖ ఆ వ్యాఖ్యలు చేసినందుకు ఏం చర్యలు తీసుకున్నారని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. తెలంగాణలో దేవాదాయ శాఖ భూముల కబ్జాలపై ఆమె దృష్టి సారించాలని కోరారు. హైదరాబాద్‌లోని పాతబస్తీలో దేవుడి భూములను మజ్లిస్ పార్టీ నాయకులు కబ్జాలు చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు ఆ పార్టీ నేతలతో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆరోపించారు. మజ్లిస్ పార్టీ నేతలు ఇచ్చే కమీషన్ల మీదనే మంత్రికి ధ్యాస ఉన్నట్లు ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాముడి నామాన్ని ఎదిరించాలనుకున్న వారు గాల్లో కొట్టుకుపోతారని హెచ్చరించారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆమెను పిలిపించి రాజీనామా చేయించాలని, లేకపోతే కేసీఆర్ లాగే మునిగిపోతారని హెచ్చరించారు.

## గంగుల కార్యాలయం, కౌశిక్ రెడ్డి కారుపై దాడిని ఖండించిన కేటీఆర్, హరీశ్

**కరీంనగర్‌లో గంగుల కార్యాలయం వద్ద బీజేపీ కార్యకర్తల దాడి**
**కౌశిక్ రెడ్డికి ఫోన్ చేసిన కేటీఆర్**
**ప్రజాస్వామ్యంపై దాడి అన్న హరీశ్ రావు**



**కరీంనగర్, జై భీమ్ న్యూస్**

కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడి ఉదంతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దాడిలో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కారుని కూడా బీజేపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ ఘటనను బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్ రావు తీవ్రస్థాయిలో ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి భౌతిక దాడులకు తావులేదని, ఇది అధికార పార్టీ అండతో జరుగుతున్న దుశ్చర్య అని వారు మండిపడ్డారు. ఘటన జరిగిన వెంటనే కౌశిక్ రెడ్డికి కేటీఆర్ ఫోన్ చేసి మాట్లాడారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్న కేటీఆర్... కౌశిక్ రెడ్డితో పాటు అక్కడ ఉన్న పార్టీ కార్యకర్తల భద్రత గురించి ఆరా తీశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి (బండి సంజయ్) ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే, ఆయన అనుచరులు ఇలా బహిరంగంగా దాడులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇది శాంతిభద్రతల వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఈ ఘటనను 'ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి'గా అభివర్ణించారు. ఎమ్మెల్యే కార్యాలయంపై కర్రలు, రాడ్లతో దాడి చేసిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో గూండాయిజం పెచ్చుమీరుతోందని, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం సరికాదని హరీశ్ రావు మండిపడ్డారు.

## ఇతర వాహనాలకు ఇబ్బంది లేకుండా, సాధారణ ట్రాఫిక్‌లో రేవంత్ కాన్వాయ్ ప్రయాణం !

**శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లో కాన్వాయ్**
**ట్రాఫిక్ పూర్తిగా నిలిపివేయకుండా ఒకే లైన్‌లో వాహనాలను కదలడానికి అనుమతి**
**తన కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బందిపెట్టవద్దని రేవంత్ రెడ్డి ఇటీవల ఆదేశాలు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించింది. ఆయన కాన్వాయ్ కోసం ఎక్కడా ట్రాఫిక్‌ను నిలిపివేయలేదు. తన కాన్వాయ్ కోసం సామాన్యులను ఇబ్బంది పెట్టవద్దని, వాహనాలను ఆపవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీకి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లో ప్రయాణించింది. విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే వెళ్లడం గమనార్హం. ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడానికి బదులు ఒక లైన్‌లో వాహనాలను అనుమతించాలని ముఖ్యమంత్రి సూచించిన నేపథ్యంలో, పోలీసు అధికారులు ఈరోజు దానిని పాటించారు. ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయకుండా పోలీసులు వాహనాలను ఒకే లైన్‌లో కదలడానికి అనుమతించారు.

# మార్ష్ వీరబాదుడు.. వర్షంతో ఆగిన లక్నో-ఆర్సీబీ మ్యాచ్




**ఆర్సీబీతో మ్యాచ్‌లో లక్నోకు అదిరే ఆరంభం**

**ఆకాశమే హద్దుగా చెలరేగిన మిచెల్ మార్ష్**

**కేవలం 32 బంతుల్లో 76 పరుగులతో మార్ష్ విధ్వంసం**


**9 ఓవర్లకు వికెట్ నష్టపోకుండా లక్నో 95 పరుగులు**

**వర్షం కారణంగా తాత్కాలికంగా నిలిచిన మ్యాచ్**

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఓపెనర్ మిచెల్ మార్ష్ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. అయితే వర్షంతో మ్యాచ్ మధ్యలోనే నిలిచిపోయింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు మార్ష్ సుడిగాలి ఆరంభాన్నిచ్చాడు. ఆర్సీబీ బౌలర్లపై మొదటి బంతి నుంచే ఎదురుదాడికి దిగిన మార్ష్, బౌండరీలు, సిక్సర్లతో హోరెత్తించాడు.మార్ష్ కేవలం 32 బంతుల్లోనే 7 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 76 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17 నాటౌట్) అతనికి చక్కటి సహకారం అందించాడు. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి లక్నో వికెట్ నష్టపోకుండా 68 పరుగులు చేసింది. మార్ష్ దూకుడుతో లక్నో 9 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 95 పరుగుల భారీ స్కోరు చేసింది. ఈ దశలో వర్షం కురవడంతో ఆటకు అంతరాయం కలిగింది. దీంతో అంపైర్లు మ్యాచ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆర్సీబీ బౌలర్లలో ఎవరూ ప్రభావం చూపలేకపోయారు. కాగా, వర్షం తగ్గడంతో మ్యాచ్ మళ్లీ మొదలైంది. అంతకుముందు టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్, ఫీల్డింగ్ ఎంచుకున్నాడు.

# టాస్ గెలిచిన ఆర్సీబీ.. కీలక మార్పులతో బరిలోకి లక్నో

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) జట్లు కీలక మ్యాచ్ లో తలపడుతున్నాయి. లక్నోలోని ఏకనా స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. దీంతో రిషభ్ పంత్ సారథ్యంలోని లక్నో జట్టు మొదట బ్యాటింగ్ చేయనుంది.ఈ సీజన్‌లో ఇరు జట్ల ప్రదర్శన పూర్తి భిన్నంగా ఉంది. ఆడిన 9 మ్యాచ్‌లలో కేవలం 2 విజయాలు సాధించి, వరుసగా ఆరు ఓటములతో లక్నో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో ఉంది. ప్లేఆఫ్స్ అవకాశాలు సన్నగిల్లడంతో ఈ మ్యాచ్‌లో గెలిచి తిరిగి పుంజుకోవాలని పట్టుదలగా ఉంది. మరోవైపు, 9 మ్యాచ్‌లలో 6 విజయాలతో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో గెలిచి ప్లేఆఫ్స్ బెర్త్‌ను మరింత సుస్థిరం చేసుకోవాలని ఆర్సీబీ చూస్తోంది.టాస్ గెలిచిన అనంతరం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ మాట్లాడుతూ.. "మేం మొదట బౌలింగ్ చేస్తాం. ఈ పిచ్ బాగుంది, లక్నోను తక్కువ స్కోరుకే కట్టడి చేయాలనుకుంటున్నాం. మా జట్టులో ఎలాంటి మార్పులు లేవు" అని తెలిపాడు. లక్నో కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ.. "గాయాల కారణంగా ఇంగ్లిస్, మోసిన్ ఖాన్ దూరం కావడంతో జట్టులో కొన్ని మార్పులు చేశాం. ఈ పిచ్ 180-190 స్కోరుకు అనుకూలంగా కనిపిస్తోంది" అని పేర్కొన్నాడు.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరువిరాట్ కోహ్లీ, జాకబ్ బెతెల్, దేవదత్ పడిక్కల్, రజత్ పటీదార్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్, సుయాశ్ శర్మ.ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: రసిఖ్ దార్, జోర్డాన్ కాక్స్, మంగేష్ యాదవ్, విక్కీ ఓస్వాల్, వెంకటేశ్ అయ్యర్.లక్నో సూపర్ జెయింట్స్ మిచెల్ మార్ష్, అర్షిన్ కులకర్ణి, నికోలస్ పూరన్, ఐడెన్ మార్క్‌రమ్, రిషభ్ పంత్ (కెప్టెన్/వికెట్ కీపర్), అక్షత్ రఘువంశీ, హిమ్మత్ సింగ్, షాబాజ్ అహ్మద్, దిగ్వేశ్ సింగ్ రాఠీ, మహమ్మద్ షమీ, ప్రిన్స్ యాదవ్.ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: మయాంక్ యాదవ్, ముకుల్ చౌధరి, అబ్దుల్ సమద్, ఎం సిద్ధార్థ్, అవేష్ ఖాన్.



## మార్ష్ విధ్వంసక సెంచరీ, పంత్ మెరుపులు.. ఆర్సీబీ ముందు భారీ లక్ష్యం




**లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ల విధ్వంసం**

**మిచెల్ మార్ష్ 56 బంతుల్లోనే 111 పరుగులతో అద్భుత సెంచరీ**

**చివర్లో 10 బంతుల్లో 32 పరుగులతో మెరిసిన రిషభ్ పంత్**

**వర్షం కారణంగా మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదింపు**

**డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం**

**ఛేజింగ్ లో కోహ్లీ డకౌట్**

కీలక మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ) బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో (ఆర్సీబీ) జరుగుతున్న మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ (111) అద్భుత సెంచరీతో కదం తొక్కడంతో లక్నో జట్టు భారీ స్కోరు సాధించింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది.లక్నోలోని ఏకానా స్టేడియంలో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ నిర్ణయం బెడిసికొట్టింది. ఆది నుంచే దూకుడుగా ఆడిన మిచెల్ మార్ష్, ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సర్లతో 111 పరుగులు చేసి లక్నోకు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. మరోవైపు, ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17) నెమ్మదిగా ఆడాడు.మార్ష్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (38) కూడా తనదైన శైలిలో రాణించాడు. ఇక చివర్లో కెప్టెన్ రిషభ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్ తో చెలరేగాడు. కేవలం 10 బంతులు ఎదుర్కొన్న పంత్.. 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో లక్నో స్కోరు 200 పరుగులు దాటింది. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ తలో వికెట్ పడగొట్టారు.డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 19 ఓవర్లలో 213 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి డబుల్ షాక్.. డకౌటైన కోహ్లీ!భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీ ఆదిలోనే కష్టాల్లో పడింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో, డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. ఈ ఛేదనలో బెంగళూరు 1.4 ఓవర్లలోనే కేవలం 10 పరుగులు చేసి రెండు కీలక వికెట్లు కోల్పోయింది.ఆర్సీబీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జాకబ్ బెతెల్ (4) మహమ్మద్ షమీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే, ప్రిన్స్ యాదవ్ వేసిన రెండో ఓవర్లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (0) రెండు బంతులు మాత్రమే ఆడి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కోహ్లీ డకౌట్‌గా వెనుదిరగడంతో ఆర్సీబీ శిబిరంలో నిరాశ ఆవరించింది.ప్రస్తుతం క్రీజులో దేవదత్ పడిక్కల్ (0), కెప్టెన్ రజత్ పటీదార్ (1) ఉన్నారు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే మిగిలిన బ్యాటర్లు అసాధారణ రీతిలో రాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

## మార్ష్ సెంచరీ... వర్షంతో మళ్లీ ఆగిన ఐపీఎల్ మ్యాచ్

**లక్నో, బెంగళూరు మ్యాచ్‌కు వర్షం అడ్డంకి**


**విధ్వంసక సెంచరీతో చెలరేగిన మిచెల్ మార్ష్**

**51 బంతుల్లోనే 107 పరుగులతో అజేయంగా నిలిచిన మార్ష్**

**ఆట నిలిచే సమయానికి లక్నో స్కోరు 14 ఓవర్లకు 145/1**

**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీకి తప్పని కష్టాలు**

ఐపీఎల్ 2026లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ మిచెల్ మార్ష్ విధ్వంసక సెంచరీతో చెలరేగాడు. మార్ష్ మెరుపులతో లక్నో భారీ స్కోరు దిశగా దూసుకెళ్తున్న దశలో వర్షం మరోసారి అంతరాయం కలిగించింది. దీంతో ఆటను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆట ఆగే సమయానికి లక్నో 14 ఓవర్లలో వికెట్ నష్టానికి 145 పరుగులు చేసింది.లక్నోలోని ఏకానా స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆర్సీబీ బౌలింగ్ ఎంచుకుంది. అయితే, వారి నిర్ణయం తప్పు అని నిరూపిస్తూ మిచెల్ మార్ష్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 51 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సర్లతో అజేయంగా 107 పరుగులు చేసి క్రీజులో ఉన్నాడు. జట్టు మొత్తం స్కోరులో 70 శాతానికి పైగా పరుగులు మార్ష్ చేయడం విశేషం. మరో ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17) నెమ్మదిగా ఆడి కృనాల్ పాండ్యా బౌలింగ్‌లో ఔటయ్యాడు.అనంతరం క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (14లి) కూడా దూకుడుగా ఆడుతుండగా వర్షం మొదలైంది. దీంతో అంపైర్లు ఆటను నిలిపివేసి, మైదానాన్ని కవర్లతో కప్పించారు. ఆర్సీబీ బౌలర్లలో కృనాల్ పాండ్యా ఒక్కడే వికెట్ తీశాడు. మిగతా బౌలర్లందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

## అవతార్ కష్టాలు: చిక్కుల్లో జేమ్స్ కామెరాన్... అది తన ముఖమే అంటున్న నటి

**అవతార్ లో హీరోయిన్ పాత్ర రూపకల్పనపై మొదలైన వివాదం**

**అనుమతి లేకుండా తన ముఖాన్ని వాడారంటూ నటి ఆరోపణ**

**డైరెక్టర్ జేమ్స్ కామెరాన్, డిస్నీపై కోర్టులో దావా**

**నష్టపరిహారంతో పాటు లాభాల్లో వాటా డిమాండ్**

**స్ఫూర్తి నువ్వేనంటూ గతంలో కామెరాన్ చెప్పినట్లు ఆధారాలు**



ప్రపంచవ్యాప్తంగా సినీ చరిత్రలో రికార్డులు సృష్టించిన 'అవతార్' సిరీస్ ఇప్పుడు ఓ భారీ వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమాలోని కీలకమైన హీరోయిన్ 'నేయ్‌తిరి' పాత్రను తన ముఖం ఆధారంగా, ఎలాంటి అనుమతి లేకుండా సృష్టించారని ఆరోపిస్తూ స్థానిక తెగకు చెందిన నటి క్వోరియన్కా కిల్చర్ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరాన్, వాల్ట్ డిస్నీ కంపెనీలను ప్రతివాదులుగా చేర్చారు.క్వోరియన్కా కిల్చర్ 2005లో 'ది న్యూ వరల్డ్' అనే చిత్రంలో నటించారు. అప్పుడు ఆమె వయసు కేవలం 14 సంవత్సరాలు. ఆ సమయంలో ఎల్‌ఏ టైమ్స్‌లో ప్రచురితమైన ఆమె ఫోటోను జేమ్స్ కామెరాన్ తన డిజైన్ బృందానికి ఇచ్చి, 'నేయ్‌తిరి' పాత్ర ముఖ కవళికలను రూపొందించమని చెప్పారని దావాలో ఆరోపించారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, అనుమతి తీసుకోకుండా, కనీసం గుర్తింపు గానీ, నష్టపరిహారం గానీ చెల్లించకుండా తన బయోమెట్రిక్ గుర్తింపును వాడుకున్నారని ఆమె పేర్కొన్నారు.ఆసక్తికరంగా, ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ స్వయంగా కామెరాన్ గతంలో చేసిన వ్యాఖ్యలే ఇప్పుడు కీలకంగా మారాయి. అవతార్ విడుదల తర్వాత ఓ కార్యక్రమంలో కిల్చర్‌ను కలిసిన కామెరాన్, నేయ్‌తిరి పాత్రకు ఆమె అందమే స్ఫూర్తి అని చెబుతూ ఒక స్కెచ్‌పై సంతకం చేసి ఇచ్చారు. అంతేకాకుండా, ఓ ఇంటర్వ్యూలో కూడా "నేయ్‌తిరి పాత్రకు అసలు మూలం ఎల్‌ఏ టైమ్స్‌లోని క్వోరియన్కా కిల్చర్ ఫోటోనే. ఆమె ముఖంలోని కింది భాగం చాలా ఆసక్తికరంగా ఉంటుంది" అని కామెరాన్ చెప్పిన వీడియో గతేడాది వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.స్థానిక ప్రజల హక్కుల గురించి మాట్లాడినట్లు కనిపించే అవతార్ సినిమా, వాస్తవానికి ఓ స్థానిక అమ్మాయి గుర్తింపును ఆమెకు తెలియకుండా వాడుకుందని దావాలో ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు నష్టపరిహారంతో పాటు, సినిమా లాభాల్లో వాటా ఇవ్వాలని, బహిరంగంగా ఈ తప్పును సరిదిద్దాలని కిల్చర్ డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో విచారణ దశలో ఉంది.

## తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ.. విజయ్ కు ప్రకాశ్ రాజ్ మద్దతు

**118 మంది ఎమ్మెల్యేలు ఉంటేనే ప్రభుత్వ ఏర్పాటు అంటున్న గవర్నర్**

**విజయ్ కు తగ్గిన ఎమ్మెల్యేల సంఖ్యాబలం**

**అసెంబ్లీలో లో బలం నిరపించుకునే అవకాశం ఇవ్వాలన్న ప్రకాశ్ రాజ్**

తమిళనాడు రాజకీయాల్లో ప్రభుత్వ ఏర్పాటుపై నెలకొన్న సందిగ్ధత ఇప్పుడు న్యాయపోరాటం దిశగా మారుతోంది. ఈ ఉత్కంఠభరిత పరిణామాలపై నటుడు ప్రకాశ్ రాజ్ స్పందిస్తూ గవర్నర్ తీరును తప్పుబట్టారు. ప్రజల మద్దతు పొందిన నాయకుడికి అసెంబ్లీ వేదికగా బలాన్ని నిరూపించుకునే అవకాశం ఇవ్వాలని, రాజ్యాంగపరమైన ప్రక్రియను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన విమర్శించారు. మెజారిటీని సభలోనే తేల్చాలే తప్ప, ముందే గవర్నర్ అడ్డంకులు సృష్టించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.టీవీకే అధినేత విజయ్ ఇప్పటికే గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే, మ్యాజిక్ ఫిగర్ 118కి ఎమ్మెల్యేల మద్దతు తక్కువగా ఉండటంతో, మద్దతు లేఖలు లేకుండా గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేమని గవర్నర్ స్పష్టం చేశారు. దీనికి ప్రతిస్పందనగా, తనకు సభలో బలాన్ని నిరూపించుకునే అవకాశం ఇవ్వాలని విజయ్ కోరుతున్నారు. ఒకవేళ గవర్నర్ తన నిర్ణయాన్ని మార్చుకోకపోతే, విజయ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. బొమ్మై కేసు తీర్పు ప్రకారం మెజారిటీని సభలోనే నిరూపించుకోవాలనే నిబంధనను ఆధారం చేసుకుని సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం కనిపిస్తోంది.మరోవైపు, కావలసిన ఆరుగురు ఎమ్మెల్యేల మద్దతు కోసం విజయ్ బృందం తీవ్రంగా శ్రమిస్తోంది. అన్నాడీఎంకేలోని అసంతృప్త వర్గం లేదా ఇతర చిన్న పార్టీల ఎమ్మెల్యేల నుంచి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు తెరవెనుక వేగంగా జరుగుతున్నాయి. ఒకవేళ సంఖ్యాబలం సమకూరితేనే రాజ్‌భవన్ నుంచి పిలుపు వచ్చే అవకాశం ఉంది. దీంతో తమిళనాడు రాజకీయాలు ఇప్పుడు అటు రాజ్‌భవన్, ఇటు కోర్టు మెట్ల మధ్య దోబూచులాడుతున్నాయి. విజయ్ తదుపరి అడుగు ఎటు పడుతుందనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది



## 'సిటాడెల్ 2' (అమెజాన్ ప్రైమ్) సిరీస్ రివ్యూ!

ప్రియాంక చోప్రా .. రిచర్డ్ మాడెన్ ప్రధానమైన పాత్రలను పోషించిన 'సిటాడెల్' సిరీస్ లో, సీజన్ 1కి విశేషమైన ఆదరణ లభించింది. స్పై థ్రిల్లర్ జోనర్లో రూపొందిన ఈ సిరీస్, యాక్షన్ సీక్వెన్స్ వైపు నుంచి మంచి మార్కులు కొట్టేసింది. అలాంటి ఈ సిరీస్ నుంచి సీజన్ 2 ఎప్పుడు వస్తుందా అని అంతా ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి సీజన్ 2 స్ట్రీమింగ్ కి వచ్చింది. 7 ఎపిసోడ్స్ గా రూపొందిన ఈ సిరీస్, ఇంగ్లిష్ తో పాటు వివిధ భాషల్లో అందుబాటులో ఉంది.ప్రపంచంలోని అత్యంత సంపన్నులచే 'మాంటికోర్' అనే ఒక వ్యవస్థ కొనసాగుతూ ఉంటుంది. హత్యలు చేయించడం మొదలు .. ప్రభుత్వాలను మార్చేయగల ఉన్మాదుల వ్యవస్థగా అది కొనసాగుతూ ఉంటుంది. 'మాంటికోర్'కి అడ్డుకట్ట వేయడానికి 'సిటాడెల్' అనే ఒక గూఢచారి వ్యవస్థ రంగంలోకి దిగుతుంది. ఆ గూఢచారి విభాగంలో నాడియా (ప్రియాంక చోప్రా) మేసన్ కేన్ (రిచర్డ్ మాడెన్) బెర్నార్డ్ పనిచేస్తూ ఉంటారు. కానీ ఆ ఏజెంట్లు అందరూ ఇప్పుడు చల్లాచెదురై ఉంటారు. అందుకు కారణం మేసన్ కేన్ తల్లి దాలియా.దాలియా 'మాంటికోర్'లో పనిచేస్తుందని తెలియని మేసన్, తమ గూఢచారి సంస్థకి సంబంధించిన ఏజెంట్ల జాబితాను ఆమెకి ఇస్తాడు. అలా చాలా మంది ఏజెంట్లు చనిపోవడానికి అతను కారకుడవుతాడు. ఆ ప్రమాదకర పరిస్థితి తరువాత, మేసన్ .. నాడియా .. బెర్నార్డ్ తలో దిక్కు అవుతారు. 'ఆబీ'ని పెళ్లి చేసుకున్న మేసన్, ఆమెతో ఆనందకరమైన జీవితాన్ని గడువుతూ ఉంటాడు. నాడియా తన కూతురు 'ఆషా'తో కలిసి జీవిస్తూ ఉంటుంది.ఇక బెర్నార్డ్ మాత్రం 'పౌలో బ్రాగా' స్థావరంలో బందీగా ఉంటాడు. బెర్నార్డ్ తో పౌలో మైండ్ కంట్రోల్ ప్రోగ్రామ్ ను తయారు చేయిస్తూ ఉంటాడు. ఒక వ్యక్తి మెదడులో మైక్రో చిప్ ను అమర్చి, తన ఆదేశాలను ఆ వ్యక్తి పాటించేలా చేయడమే ఆ ప్రోగ్రామ్ ఉద్దేశం. అలా తయారు చేసిన వ్యక్తితో ఒక దేశ అధ్యక్షుడిని చంపించాలానే ఆలోచనలో పౌలో ఉంటాడు. అలాంటి పరిస్థితులలో అక్కడి నుంచి బెర్నార్డ్ తప్పించుకుంటాడు. అలా తప్పించుకున్న బెర్నార్డ్, మాజీ సీఐఏ ఆఫీసర్ 'హచ్ జిమ్' ఆశ్రయాన్ని పొందుతాడు. హచ్ కూడా పౌలో పై ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశంతో ఉంటాడు. అతని సాయంతో తన మిగతా టీమ్ సభ్యులను కలుసుకునే దిశగా బెర్నార్డ్ ముందుకు వెళతాడు. తన టీమ్ ను చేరుకున్న నాడియా ఏం చేస్తుంది? తన తల్లి చేసిన ద్రోహానికి ప్రతిగా మేసన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు? మాంటికోర్ నుంచి మానవాళిని కాపాడటం కోసం వాళ్లు ఏం చేస్తారు? అనేది కథ.మెదడులో అమర్చబడిన మైక్రో చిప్ కారణంగా, తన ఆదేశాలను పాటిస్తూ మానవాళిపై విరుచుకుపడే హంతకులను తయారు చేయించడానికి పౌలో రంగంలోకి దిగడంతో ఈ సిరీస్ మొదలవుతుంది. గతంలో చెల్లాచెదురైపోయిన 'సిటాడెల్' ఏజెంట్లు, నిదానంగా కోలుకుని తిరిగి ట్రాక్ లో పడుతూ ఉండటంతో ఈ కథ జోరందుకుంటుంది. 'సిటాడెల్' టీమ్ అంతా ఒక దగ్గరికి చేరుకున్న దగ్గర నుంచి ఉత్కంఠభరితంగా మారుతుంది. 'సిటాడెల్'కి సంబంధించిన ఏజెంట్లకి ఎదురయ్యే ప్రమాదకరమైన సంఘటనలు, వాటి బారి నుంచి వాళ్లు బయటపడే తీరు ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తిస్తూ ఉంటుంది. తమ ఆపరేషన్ కి అవసరమైన 'ఎడిసన్' ను పట్టుకోవడానికి సిటాడెల్ ఏజెంట్లు ప్లాన్ చేసిన తీరు బాగుంది. అయితే మొదటి మూడు ఎపిసోడ్స్ తరువాత కథ కాస్త నిదానంగా నడుస్తూ వెళుతుంది. మేసన్ .. అతని తల్లికి సంబంధించిన సన్నివేశాలను, సంభాషణలతో సాగదీసిన భావన కలుగుతుంది. 'సిటాడెల్' మొదటి సీజన్ .. భారీతనమే ప్రధానమైన ఆకర్షణగా నిలిచింది. అందుకు ఎంత మాత్రం తగ్గని నిర్మాణ విలువలతో ఈ సిరీస్ ఆకట్టుకుంటుంది. కథా పరంగా ట్విస్టులు ఉన్నప్పటికీ, అవి కొత్తగా ఏమీ అనిపించవు. యాక్షన్ సినిమాలను ఇష్టపడేవారిని అలరించే రీతిలోనే యాక్షన్ సీక్వెన్స్ ఆకట్టుకుంటాయి. కథలో ఎమోషన్స్ కి పెద్దగా ఛాన్స్ ఇవ్వలేదు .. ఉన్న కొద్ది ఎమోషన్ కనెక్ట్ కాలేదు.పౌలో పాత్రను ఒక రేంజ్ లో పరిచయం చేశారు. తనదైన ప్రత్యేకమైన నేర సామ్రాజ్యాన్ని స్థాపించిన పౌలో, దేశ అధ్యక్షులను టార్గెట్ చేసే స్థాయిలో చక్రం తిప్పుతుంటాడు. అయితే ఆ తరువాత చోటుచేసుకునే సన్నివేశాలు ఆ పాత్ర స్థాయిని తగ్గించినట్టుగా అనిపిస్తుంది. అతను బంధించబడిన దగ్గర నుంచే కథ కాస్త నీరసించినట్టు కనిపిస్తుంది. నటీనటుల నటన మెప్పిస్తుంది. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ పనితీరు బలంగానే కనిపిస్తుంది. ఇది స్పై థ్రిల్లర్ కావడం వలన, అందుకు తగినట్టుగానే ఛేజింగులు .. యాక్షన్ సీన్స్ ఆకట్టుకుంటాయి. కథ రొటీన్ గా అనిపిస్తుంది. కథనం నిదానంగా సాగుతుంది. అభ్యంతరకరమైన సన్నివేశాలు .. సంభాషణలు ఉన్నాయి. అందువలన నలుగురితో కలిసి చూడటం కాస్త ఇబ్బందినే కలిగిస్తుంది.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM